భక్తులకు ఈ అవకాశం మళ్లీ దొరకదు




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 80 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 18 మార్చి 2026




## మీ సాయం మాకక్కర లేదు..

**అమెరికా చాలా శక్తివంతమైన దేశం**

**హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం**

**మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక**

**వాషింగ్టన్,మార్చి17(పిసీడబ్ల్యూ న్యూస్):**హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. మిగతా2లో...

## అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం

**సిఎం రేవంత్‌ను తీసుకు వస్తా..**

**కెసిఆర్‌ను మీరు తీసుకు రావాలి**

**మండలిలో మహేశ్ గౌడ్ ఆవేశపూరిత ప్రసంగం**



**హైదరాబాద్,మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం..అందుకు మీరు సిద్దమేనా అంటూ శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసు సిగ్గు చేటని, బిఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. 'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి. మిగతా2లో...

## కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు

- గత ప్రభుత్వ పాపాలను మరచి మాట్లాడొద్దు
- మేం చేశామో లెక్కలతో సహా వివరిస్తామన్న భట్టి



**హైదరాబాద్,మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ మాట్లాడుతున్నంత సేపు మంత్రులు పలు అంశాల్లో తిప్పి కొట్టారు. గత హయాంలో చేసిన తప్పులు మరచి, ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. చేస్తున్న అభివృద్ధిని అభినందించి, తగిన సూచనలు చేస్తే మంచిదని అన్నారు. కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. 'పదేళ్లు అధికారంలో ఉండి మహిళా సాధికారతను గాలికి వదిలేశారు. మీ ఇంటి ఆడబిడ్డపై మీకు ఏ గౌరవం ఉందో రాష్ట్రమంతా చూస్తోంది. కానీ రాష్ట్ర మహిళల మిగతా2లో...

## కాంగ్రెస్ గ్యారెంటీలకు.. ప్రభుత్వానికి జీరో వాల్యూ

**సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది..?**

**సిఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా..?**

**ఎక్కడ పోయిందో సిట్ ద్వారా వెతికి పట్టండి**

**ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా..?**

**గత గవర్నర్ ప్రసంగాలకు..నేటికి ఏం తేడా..?**

**గవర్నర్ ప్రసంగంలోనే తప్పులు దొర్లితే ఎలా..?**

**ఐటి సెక్రటరీ ఎవరో వారిని తొలగించండి**

**420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుంది**

**ధన్యవాద తీర్మానంపై ఎందుకు ధన్యవాదాలు తెలపాలి**

**తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ విసుర్లు**



**హైదరాబాద్,మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ శాసన సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది?తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మిగతా2లో...

రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో

## కీలక నిర్ణయం

- విచారణకు సిట్ ఏర్పాట్లు చేస్తూ ప్రభుత్వం ఆదేశం
- చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు




అఫ్గానిస్థాన్‌లో

## పెను విషాదం

**కాబూల్ ఆస్పత్రిపై**

**పాక్ వైమానిక దాడి**

**దాడిలో 400 మంది**


**మృత్యువాత**

**మంటల్లో చిక్కుకున్న**

**ఆస్పత్రి భవనం**

**దాడి ఘటనను**

**తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం**



**కాబూల్, 17(పిసీడబ్ల్యూ న్యూస్):** అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ మిగతా2లో...

జర్నలిస్టుల సంక్షేమానికి

## కట్టుబడి ఉన్నాం

- ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్,మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మిగతా2లో...

## లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

**- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్**



**హైదరాబాద్,మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. గవర్నర్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆహుతులను స్వయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడికి విచ్చేసిన విశిష్ట అతిథులకు, ఆహ్వానితులకు, లోక్ భవాని పరివార్ సభ్యులకు మరియు కళాకారులకు పేరు పేరున నాహృదయపూర్వక నమస్కారములు అని అన్నారు. మీ అందరికీ శ్రీ 'పరాభవ' నామసంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ నూతన సంవత్సరం మీ కుటుంబాల్లో ధన, ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుకుం టున్నట్లు వెల్లడించారు. అరవై ఏళ్ల కాలచక్రంలో 'పరాభవ' 40 వ సంవత్సరం.. పరాభవ అంటే..

మిగతా2లో...

## దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

**పితృత్వ సెలవులపైనా నిర్ణయం తీసుకోవాల్సిందే**

**పిల్లల పెంపకంలో తండ్రులకు కూడా భాగస్వామ్యం**

**ప్రసూతి సెలవుల విచారణలో సుప్రీం కీలక ఆదేశాలు**



**న్యూఢిల్లీ,మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే.. ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని తీర్పులో పేర్కొంది. ఆ బిడ్డ వయసుతో సంబంధం లేకుండా ఆ తల్లికి 12 వారాల సెలవు పొందడానికి అర్హత

మిగతా2లో...

# అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించా రు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ గ్యారెంటీలకు..ప్రభుత్వానికి జీరో వాల్యూ

(మొదటి పేజీ తరువాయి)

మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు..



రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని.. ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు.పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్దాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధ మని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పు మాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అఫ్ఘానిస్థాన్‌లో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గనిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియోలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఎ÷-గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని అఎ÷-గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు.

# కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

గౌరవంపై చిన్న చూపు వద్దు. రాష్ట్రాన్ని అభాసుపాలు చేయాలనే ఆలోచన మంచిది కాదని భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని బీఆర్ఎస్ ఆరోపించడం సరికాదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందనేది లెక్కలతో చెబుతామని తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని వివరించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందరికీ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. రూ.22,500 కోట్లతో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'మీలా మేము ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఇవ్వకుండా వదల్లేదు. మూడు ఎకరాలు ఇస్తామని ఇవ్వకుండా వదిలేయలేదు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేయలేదు. మీరు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కడుతూనే ఈ పనులన్నీ చేస్తున్నాం' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కానీ అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో తెలం గాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూ డబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# మీ సాయం మాకక్కర లేదు..

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి, విజయానికి పునాది వేసేదని అర్థం. ఈ సంవత్సరం మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని నా విశ్వాసం అని గవర్నర్ శుక్లా ఆకాంక్షించారు. మన తెలంగాణ రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. గత అనుభవాల నుండి నేర్చుకుంటూ, మరింత నిబద్ధతతో, సేవాభావంతో మన లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ఉగాది అంటేనే కొత్త శకం. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మన జీవితంలోని కష్ట సుఖాల కలయికను సూచిస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్ రావాలని కోరారు. కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం. మంత్రుల మార్పులు, చేర్పుల్లో సీఎంకే పూర్తి స్వేచ్ఛ ఉందని శ్రీధర్‌బాబు అన్నారు.

# దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని స్పష్టం చేసింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని వ్యాఖ్యానించింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్నబిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని పేర్కొంది. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం.. 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఈ క్రమంలో పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీం పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక మూడు నెలలలోపు వయసున్న పిల్లల్ని దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే 12 వారాల మాతృత్వ సెలవులను కేటాయించడం సరికాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ మేరకు సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది.

# రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో కీలక నిర్ణయం

- విచారణకు సిట్ ఏర్పాట్లు చేస్తూ ప్రభుత్వం ఆదేశం
- చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు





హైదరాబాద్,మార్చి 17 (పిసీడబ్ల్యూ న్యూస్): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వం వహిస్తారని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ వ్యవహారంపై సిట్ విచారణ చేయనుంది. దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందా, నమిత్ శర్మ రియల్ వ్యాపారాలు తదితర అంశాలపై సిట్ విచారణ జరపనుంది. ఈ డ్రగ్స్ కేసులో వీటిని ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు? ఈ పార్టీలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు ఎవరు? వారికి మీకు ఉన్నా లింకులు, దుబాయ్ లింకులు తదితర అంశాలపై పలు కోణాల్లో విషయాలను రాబట్టేందుకు ఈ సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి సిట్ నివేదికను అందించనుంది. మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌పై ఆదివారం పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. ఈ సమయంలో న్యూఢిల్లీకి చెందిన నమిత్ శర్మ.. కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. వారిని చుట్టిముట్టారు. ఈ సందర్భంగా 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. వారిలో పలువురికి పాజిటివ్ వచ్చింది. వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సైతం ఉన్నారు. ఆయనకు కూడా డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అలాగే పైలట్ రోహిత్ రెడ్డికి పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరికి వారి వారి పార్టీల నుంచి నోటీసులు అందాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలంటూ వారికి ఆయా పార్టీలు స్పష్టం చేశాయి. అప్పటి వరకు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నాయి.

# భక్తులకు ఈ అవకాశం మళ్లీ దొరకదు

**- శ్రీరస్తు - శుభమస్తు, రాముల వారి కళ్యాణానికి అందరూ తరలిరండి**

**- తొర్రూర్ నుండి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నాం వెల్లడించిన డిఎం పద్మావతి**






**తొర్రూరు ప్రతినిధి, మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** ఈనెల 27న భద్రాచలంలో సీతారాముల కళ్యాణం జరగనున్న నేపథ్యంలో తొర్రూరు నుండి భద్రాచలానికి ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నామని తొర్రూరు డిఎం పద్మావతి వెల్లడించారు. భద్రాచలంలో జరుగుతున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎక్స్ప్రెస్ బస్సులను భక్తుల కొరకు ప్రత్యేకంగా నడిపిస్తూ కళ్యాణం అయిపోయిన అనంతరం తిరిగి బస్సులో వెళ్ళిన ప్రయాణికులను తీసుకురావడం జరుగుతుందని అన్నారు. కళ్యాణానికి వెళ్లే భక్తులకు బస్ చార్జీ పెద్దలకు 450/-- రూపాయలు మరియు పిల్లలకు 280 /--రూపాయల చొప్పున నిర్ణయించడం జరిగింది. భక్తులను భద్రాచలం తీసుకొని వెళ్లి కళ్యాణం అనంతరం తిరిగి అదే బస్సులో తొర్రూరుకు చేర్చుతామని అన్నారు. ఈ బస్సు ఉదయం 4.00 గంటల కు బయలుదేరి మరల కళ్యాణ మహోత్సవం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు భద్రాచలం నుండి బయలుదేరుతుందని పేర్కొన్నారు పట్టణ వాసులే కాకుండా పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని రాముల వారి కల్యాణాన్ని తిలకించి ఆనందించాలని వారు కోరారు. సీతారాముల కళ్యాణం చూద్దాం రారండి, చూచు వారాలకు చూడముచ్చట పుణ్యపురుషులకు ధన్య భాగ్యమట అంటూ పెద్దలు చెప్పిన మాట ఇది.



# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా, మార్చి 17(పిసీడబ్ల్యూ న్యూస్):** మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంల) గోదామును జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలోజిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గోదాంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగిషర్లను ఇతర అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే గోదాం సీల్ తీయడం జరిగిందని తనిఖీ చేసిన అనంతరం తిరిగి సీల్ వేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ డిప్యూటీ తాహసిల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

**● జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**







**నడికూడ, మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని నడికూడ మండలంలోని కంఠత్మకూర్ గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు మరియు రైతుల మధ్య వారధిగా నిలిచి నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు చేరవేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో జరుగుతున్న ఆధునిక మార్పులకు రైతులను సన్నద్ధం చేయాలని, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని అన్నారు. రైతులకు ఆధునిక పద్ధతులను అర్థమయ్యే విధంగా వివరించడంతో పాటు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమని తెలిపారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న, మిరప పంటల కోతలు కొనసాగుతున్న నేపథ్యంలో, మార్కెటింగ్ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు నేల ఆరోగ్యాన్ని కాపాడడం ముఖ్యమని పేర్కొన్నారు. ఎరువుల వినియోగంలో మితి పాటించాలని, సేంద్రీయ వ్యవసాయం, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. కూలీల కొరతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ యాంత్రికరణను అవలంబించాలని తెలిపారు. అలాగే వరి పంటలో అగ్గి తెగులు, గింజ మచ్చ తెగులు నివారణ, మొక్కజొన్నలో ఎండు తెగులు తట్టుకునే రకాల ఎంపిక, మిరప పంటలో కోత అనంతర నిర్వహణపై వివరించారు. విత్తన శుద్ధి ప్రాముఖ్యతను కూడా తెలియజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ మాట్లాడుతూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి అనసూయ ఉద్యాన శాఖ అందిస్తున్న రాయితీలు, ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి. రవీంద్ర నాయక్ విద్యార్థులు నిర్వహించిన సదస్సును, ప్రదర్శించిన నమూనాలను అభినందిం చారు. గ్రామ సర్పంచ్ తిరుపతి, ఉప సర్పంచ్ కుమారస్వామి కార్యక్రమ నిర్వహణకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు తమ అనుభవాలను పంచుకోగా, రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ శాస్త్రవేత్తలు, జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రామ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పోరాటం:

**● నాయబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత..**




**మల్లంపల్లి మండల ప్రతినిధి, మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మల్లంపల్లి మండల బీజేపీ అధ్యక్షులు బైకానీ మహేందర్ యాదవ్ విమర్శించారు. మంగళవారం మల్లంపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన నాయబ్ తహసీల్దార్ గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ:6 గ్యారెంటీలు ఏవి?: నిరుద్యోగ భృతి, రైతు భరోసా, మరియు మహిళలకు మహాలక్ష్మి పథకం వంటి హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. పింఛన్ల జాప్యం: మండలంలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. స్థానిక సమస్యలు: గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, మరియు ధరణి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రజా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఓబీసీ జిల్లా అధ్యక్షులు దండిగా వెంకన్న బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కంతి హరీష్ మండల సీనియర్ నాయకులు బొమ్మ రతి సారన్నా బండి బాబు పోతారాజు రమేష్ గొట్టే ముక్కల నరేష్ రాగుల శ్రీకాంత్ గుంటుక సురేష్ మనోహర్ స్వామి తది తరుల పాలొగొన్నారు.

# గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు..




**నడికూడ, మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** గంజాయి తరలింపు కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పరకాల సి ఐ క్రాంత్ కుమార్ తెలిపారు. సిఐ వివరాల ప్రకారం గత సంవత్సరంలో మండలంలోని చర్లపల్లి గ్రామంలో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి నలుగురి నిందుతులపై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమండ్ కి తరలించడం జరిగింది. అందులో ఒకరు భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచకు చెందిన వెంకటేష్ పరారీలో ఉండగా మంగళవారం నడికూడ మండల కేంద్రంకు వచ్చాడన్నా సమాచారం మేరకు పరకాల సి ఐ క్రాంతికుమార్ సిబ్బంది తో వెళ్లి నిందితుడు వెంకటేష్ ను పట్టుకొని అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్ సీజ్ చేసి రిమాండ్ కి తరలించినట్లు సి.ఐ తెలిపారు.

# రైతు భరోసా విడుదల చేయకపోవడం రైతులను మోసం చేయడమే...

**● రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి లేని పక్షంలో ఆందోళనలు చేపడుతాం: బీఆర్ఎస్వి నడికూడ మండల అధ్యక్షులు వెంకటేష్**



**నడికూడ, మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** యాసంగి పంటలు వేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతు భరోసా విడుదల చేయకపోవడం అంటే రైతులను మోసం చేయడమేనని బీ ఆర్ ఎస్ వి నడికూడ మండల అధ్యక్షులు దురిశెట్టి వెంకటేష్ పేర్కొన్నారు. యాసంగి వరి నాట్లు పూర్తయి నెలలు గడుస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను విడుదల చేయడంలో జాప్యం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా భరోసా నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల పక్షపాతి అని చెప్పుకునే ప్రభుత్వం రైతులకు చేసింది ఏమి లేదని రెండు లక్షల రుణమాఫీ సైతం పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# ఘనంగా 'దావత్-ఏ-ఇఫ్తార్'

**● పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు అయూబ్ మహమ్మద్**






**హన్మకొండ,మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హన్మకొండ 50వ డివిజన్ జులైవాడలోని మసీదులో మంగళవారం సాయంత్రం దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు అయూబ్ మహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మసీద్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వారందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అయూబ్ మహమ్మద్ మాట్లాడుతూ.. రంజాన్ మాసం కేవలం ఉపవాస దీక్షలకు మాత్రమే పరిమితం కాదని, ఇది త్యాగం, సహనం మరియు దాతృత్వానికి గొప్ప ప్రతీక అని కొనియాడారు. సమాజంలో మత సామరస్యం వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. ఇలాంటి సామూహిక ఇఫ్తార్ విందులు మనుషుల మధ్య పరస్పర గౌరవాన్ని, ప్రేమాభిమానాలను మరింత పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో పలువురు ప్రముఖులు పాల్గొని ఇఫ్తార్ విశిష్టతను చాటిచెప్పారు: తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్, కాజిపేట్ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా గులాం అఫ్జల్ బియబాని (కుస్రో పాషా), రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హన్మకొండ జిల్లా మైనారిటీ చైర్మన్ మీర్జా అజీజుల్లా భేగ్, కార్పొరేటర్ నెక్కొండ కవిత-కిషన్ కుమార్ వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మసీద్ కమిటీ బాధ్యులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదు ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గుగులోతు హుస్సేన్ నాయక్



**హన్మకొండ,మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ గోపాలపురం జోనల్ ఎస్టి మోర్చా అధ్యక్షుడిగా హనుమకొండ 56వ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీకి చెందిన గుగులోత్ హుస్సేన్ నాయక్ నియమితులయ్యారు. బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్ ఆదేశం మేరకు బిజెపి గోపాలపురం జోనల్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యాలయ కార్యదర్శి అలుగునూరి కృష్ణంరాజు, బిజెపి గోపాల్పూర్ జోనల్ కార్యదర్శి బొద్దిరెడ్డి సురేందర్ రెడ్డి, జోనల్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బత్తుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సతీష్, జిల్లా నాయకులు ఆరే రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ యోజన స్కీం లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..

**కరీంనగర్,మార్చి17(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం లో భాగంగా ట్రైనింగ్ పూర్తయిన వారికి మంగళవారం రోజున కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షులు మాడిశెట్టి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నగునూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి టూల్ కిట్స్ భాగంగా లబ్దిదారులకు 15000 రూపాయల కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా దేశంలోని లక్షలాది మంది లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. 18 రకాల కుల వృత్తుల వారికి శిక్షణతో, సర్టిఫికెట్,మూడు లక్షల వరకు రుణ సదుపాయం, టూల్ కిట్స్ ను ఈ పథకం ద్వారా పొందవచ్చున్నారు. విశ్వకర్మ యోజన స్కీం ఎంతో సత్ఫలితాలను ఇస్తుందని, ఎంతోమందికి ఈ పథకం అండగా నిలిచి ఆర్థిక



అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. కులవృత్తుల ప్రోత్సాహం కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అందిస్తున్న విశ్వకర్మ యోజన స్కీంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కులవృత్తులు నిలదుక్కుకోవడానికి విశ్వకర్మ యోజన ద్వారా చేయూతనందిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కరీంనగర్లో స్కీం అమలు కోసం కృషి చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మాడ వెంకటరెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, కొమురయ్య, గ్రామ సర్పంచ్, సాయల్ల శ్రావణి,మహేందర్ జిల్లా నాయకులు,కొత్తకొండ దీపక్ తేజ, మైనారిటీ మోర్చా అధ్యక్షులు అఫ్రోజ్, బూత్ అధ్యక్షులు ఆవుల రాజు, వరి అజయ్, సాయిల్ల వినయ్,బీజేపీ నాయకులు దావు సంతోష్,మోహన్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, శ్రీనివాస్,హరీష్, వెంకటేష్, సచిన్ సంజయ్,వేణు, మదన్, కుమార్, వెంకటేష్, గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన నిర్వహణ కోసం కమిటీ ఏర్పాటు...





**కరీంనగర,మార్చి17(పీసీడబ్ల్యూ న్యూస్):**సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ లో హిందూ సమ్మేళనం నిర్వహించడానికి కమిటీని ఏర్పాటు చేశారు.శ్రీ యజ్ఞవరాహస్వామి హిందూసమ్మేలనసమితి గాఈ కమిటీ కి ఈ సందర్భంగా నామకరణం చేశారు. పుర ప్రముఖులు చందాసుధాకర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కమిటీ కి అధ్యక్షులుగా చొల్లేటి రమేష్ ,కార్యదర్శి గాబూట్ల పవన్ కుమార్, కోశాధికారిగా గంద్ర సత్యనారాయణమహిళా ప్రముఖులుగా బండపల్లి ఉదయ తదితరులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విభాగ్ సహవ్యవస్తాప్రముఖ్ దావులూరి మురళీధర్ మాట్లాడుతూ హిందూ సమ్మేళన ఆవశ్యకత, ఎందుకు నిర్వహించుకోవాలనే విషయంపైన అవగాహన కల్పించారు చొల్లేటి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ కూనాడి రాంరెడ్డి,మండల కార్యవాహ మాదాసు విక్రమ్, మండలవ్యవస్తాప్రముఖ్ తాడెంఐలయ్య, శాఖా కార్యవాహ ఎం లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# "కాకతీయ కళాశాల NSS శిబిరం 5వ రోజు: సేవా కార్యక్రమాలు, అవయవ దానంపై చైతన్యం"





**హనుమకొండ : మార్చి 17 (పిసి డబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్ హనుమకొండ జాతీయ సేవా పథకం యూనిట్ 2 మరియు యూనిట్ 3 వారిచే ఊరుగొండ, దుర్గంపేటలో నిర్వహించబడుతున్న ప్రత్యేక శిబిరము ఐదవ రోజుకు చేరుకుంది .ఐదవ రోజు కార్యక్రమాలు ఉదయం యోగ కార్యక్రమం తో మొదలైంది. తదనంతరం పాఠశాల ప్రాంగణంలో గల ఉపయోగంలో లేని బావిని పూడ్చి వేసినారు. పాఠశాల ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న బావిని పూడ్చడంలో గ్రామ సర్పంచ్ పోలేపాక శ్రీనివాస్ పాల్గొన్నారు. తదనంతరం నాగేంద్ర స్వామి దేవాలయానికి వెళ్లి దేవాలయ పరిసరాలలో ఉన్న ప్లాస్టిక్ ను ఏరు వేయడం జరిగినది. మధ్యాహ్నం వేల వ్యక్తిత్వ వికాసం లో భాగంగా అవయవ దానం, శరీర దానంపై అవగాహన కల్పించబడింది .అవయవ దానం ,శరీర దానంపై అవగాహన కల్పించేందుకు ముఖ్య వక్తగా పార్సి నవీన్ కుమార్ గారు సదాలోచన ఫౌండేషన్ వ్యవస్థాపకులు విచ్చేసి వాలంటీర్లకు రక్తదానం, అవయవ దానం, శరీర దానం పై అవగాహన కల్పించారు .వారు మాట్లాడుతూ నేడు ప్రపంచంలో వివిధ అవయవాలు అవసరం ఉన్న వ్యక్తులు ,శరీరం అవసరం ఉన్న వైద్య విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ దానం చేయవచ్చని, అవయవ దానం చేయవచ్చని తెలిపినారు .కొన్ని దానాలు మనం జీవించి ఉన్న సందర్భంలో ,మరికొన్ని దానాలను మరణానంతరం మాత్రమే చేయవచ్చు అన్నారు .రక్తదానం చర్మదానం ,కాలేయ దానం, కిడ్నీ దానం ,జీవిస్తూ కూడా ప్రక్కవారిని బ్రతికించవచ్చు అని తెలిపారు .సదాలోచన ఫౌండేషన్ అనేది అందరిలో ఒక మంచి వ్యక్తిత్వాన్ని రూపొందించేందుకై రక్తదానం పై అవగాహన కల్పించేందుకు ఏర్పడిందని తెలియజేస్తూ 61 సంవత్సరాలు గలిగిన తను 12 మార్లు రక్తదానం చేసిన అని తెలిపి విద్యార్థులను ఉత్సాహంగా ఉత్తేజపరిచినారు .రక్తదానం, అవయవ దానం ,శరీర దానంపై ముందస్తు అంగీకార పత్రాలు కూడా ఇవ్వవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ బి సీతారాం, డాక్టర్ బి రమేష్, గాయత్రీ దేవి పాల్గొన్నారు.

# పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు మంత్రి తుమ్మల గ్రీన్ సిగ్నల్

### ఎండిపోతున్న పంటలకు ఊపిరి.. వెంటనే నీటి విడుదలకు ఆదేశాలు

### రైతుల ఆవేదనకు స్పందించిన తుమ్మల.. యుద్ధ ప్రాతిపదికన చర్యలు

### పులిగుండాల ప్రాజెక్టు నీరు విడుదల త్వరలో,,, 1000 ఎకరాలకు ఉపశమనం

### సాగునీటిపై మంత్రి తుమ్మల దృష్టి.. అడ్డంకుల తొలగింపుకు కఠిన ఆదేశాలు



**పెనుబల్లి, మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పెనుబల్లి మండలంలోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో సాగునీటి కొరత తీవ్రంగా ఉన్నట్లు సమాచారం అందడంతో పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి రెవెన్యూ, ఫారెస్ట్ మరియు ఇరిగేషన్ శాఖల సమన్వయంతో అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎఫ్ఓ సిద్ధార్థతో మంత్రి నేరుగా ఫోన్లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వెలుగుమట్ల బాధితులకు అందరికీ న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు: రాకేష్ గైక్వాడ్



**హైదరాబాద్ మార్చి17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లా వెలుగు మట్ల బాధితులందరికీ న్యాయం జరిగే వరకూ కవితక్క పోరాటం ఆగదని హరి బోలి డివిజన్ యువ నాయకులు రాకేష్ గైక్లార్డ్ అన్నారు.అందరికీ న్యాయం జరిగేలా పోరాటం చేసేందుకు కమిటీ దోహదపడుతుందని రిటైర్డ్ జడ్జి, ఆర్మీ మాజీ మేజర్, ప్రొఫెసర్లు, లాయర్లు, సామాజికవేత్తలు జర్నలిస్టుతో కమిటీ వేయడం, పేదలకు న్యాయం చేసేందుకు ఇదే సరైన సమయం అని వెలుగుమట్లలో ప్రభుత్వం ఎంత కరకశంగా వ్యవహరించిందో అక్కడకు వెళ్తే అర్థమవుతుందని, పేదల ఇండ్లను కొల్లగొట్టడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందు వరుసలో నిలబడదని, పేదలకు న్యాయం జరిగే వరకూ కవితక్క ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా రాకేష్ గైక్వాడ్ అన్నారు. తెలంగాణ జాగృతి నాయకులు కఠినమైన ఆస్థానా,శ్రీకర్ శర్మ, రాజు, కుమార్, ఓంకార్ స్వామి, నిలయ్ భూషణ్ రాయ్ ఆస్థానా,నితిన్, నవీన్, రూప్ సింగ్,సచిన్, శశి,పల్లవి,ముఖేష్ రాహుల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఉగాది పర్వదిన వేడుకల కోసం ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయము :వేడుకలకు హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

### - సాయంత్రం దేవాలయానికి రానున్న హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ

**కరీంనగర్,మార్చ్17(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని ముగ్గురు అమ్మవార్లు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతిల మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది (తెలుగు నూతన సంవత్సరం) వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య ఆశీస్సులతో ఉగాది మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం తెల్లవారుజామున 4:30 గంటలకు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకపూజ, విశేష అలంకరణ



కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి ఆలయంలో ఉగాది పచ్చడిని అమ్మవారికి నివేదించి భక్తులకు ప్రసాదంగా అందించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అలాగే వేద పండితుల ఆధ్వర్యంలో కొత్త సంవత్సరానికి సంబంధించిన పంచాంగ వివరములు, రాశి ఫలాలు తదితర



విశేషాలను తెలుసుకోవడానికి పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని గురువారం రోజున సాయంత్రం 6 గంటలకు ఆలయంలో నిర్వహించనున్నారు. పంచాంగ శ్రవణ కార్యక్రమానికి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామితో పాటు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. శ్రీ మహాశక్తి ఆలయంలో ఉగాది వేడుకలు ఎంతో వైభవంగా ఆధ్యాత్మికత శోభతో ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తుండడంతో దేవాలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుంటున్న దృశ్య, తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దేవాలయం వివిధ పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. శ్రీ మహాశక్తి దేవాలయంలో జరిగే ఉగాది పర్వదిన వేడుకలకు భక్తులు, హిందూ బంధువులు తరలివచ్చి అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.



# కరాటే పోటీల్లో తెలంగాణ నారాయణ విద్యార్థుల ప్రభంజనం



**- 20 మంది విద్యార్థులకు స్వర్ణ పథకాలు**

**- తెలంగాణ నారాయణ పాఠశాల డైరెక్టర్ కొదుమూరు నాగపవన్**





**ఖమ్మం ప్రతినిధి, మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కరాటే పోటీల్లో తెలంగాణ నారాయణ విద్యార్థులు ప్రభంజనం సృష్టించి పాల్గొన్న 20 మంది విద్యార్థులందరూ స్వర్ణ పథకాలు సాధించారని ఆ పాఠశాల డైరెక్టర్ కొదుమూరు నాగపవన్ అన్నారు. ఖమ్మం నగరంలోని ఎంబి గార్డెన్ లో ఆదివారం టైగర్ షోటోఖాన్ కరాటే ఇంటర్నేషనల్ ఇండియా వారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన 'కరాటే ఛాంపియన్ షిప్ 2026' లో ఖమ్మం విడిఓస్ కాలనీలో తెలంగాణ నారాయణ స్కూల్ విద్యార్థులు "కరాటే" పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొదుమూరు నాగపవన్ మాట్లాడుతూ... "విద్యార్థులలో క్రమశిక్షణ, పోటీతత్వం పెంపొందాలంటే కరాటే లాంటి ఆత్మరక్షణ కళలు ఎంతో దోహదం చేస్తాయని, విద్యార్థులందరూ ముఖ్యంగా బాలికలు కరాటే వంటివి నేర్చుకోవడం వలన తమ జీవితంలో ఎదురయ్యే ఎన్నో సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కోగలరని" పతకాలు సాధించిన విద్యార్థులందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ వినోద్, షఫీ మాస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ నరేంద్ర వర్మ పాల్గొన్నారు.

## "వందేమాతరం ఘటనపై ఎంఐఎం ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలి" : డా. జాడి రామరాజు నేత



**ములుగు జిల్లా,మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏటూరునాగారం మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఎన్నికల కమిటీ కన్వీనర్ గాడిచార్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ మండల ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు డా. జాడి రామరాజు హాజరై మాట్లాడారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా వందేమాతరం గీతం పాడుతున్న సమయంలో అసెంబ్లీ సమావేశం నుంచి బయటకు వెళ్లిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై విమర్శలు గుప్పించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, అలాంటి ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, సిపిఎం, సిపిఐ పార్టీలపై విమర్శలు చేస్తూ, ఈ పార్టీలు దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా మేధావులు, యువత, పత్రికా వర్గాలు ఈ విషయాలను లోతుగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ప్రజలు తమ సంస్కృతి పరిరక్షణ కోసం చైతన్యంతో ముందుకు రావాలని అన్నారు. గతంలో దేశం విదేశీ పాలనలోకి వెళ్లడానికి కొన్ని శక్తులు కారణమయ్యాయని, భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి రాజకీయంగా సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ యర్రల ఎల్లయ్య, బీజేపీ ఉపాధ్యక్షుడు దుర్గం దుర్గారావు, జనగాం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసం మీ చైర్మన్ వార్డుల్లో విస్తృత పర్యటన

**● సమస్యల పరిష్కారానికి చైర్మన్ హామీ ● ప్రజల సమస్యలపై ఫోకస్ వెంటనే చర్యలకు ఆదేశాలు ● డ్రైనేజీ, నీటి సమస్యలపై స్పాట్‌లోనే స్పందన ● ప్రజా పాలనప్రగతి ప్రణాళికతో అభివృద్ధి పనులు వేగం**







**కల్లూరు, మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మీ కోసం మీ చైర్మన్ కార్యక్రమంలో భాగంగా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ బానోత్ మారోణి పంతులు కలిసి 5వ, 6వ వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించారు. ప్రాంతాలలో తలెత్తుతున్న మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి, వాటిని అతి త్వరలోనే పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. 6వ వార్డు పరిధిలోని వాచ్ నాయక తండాలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు ప్రారంభించారు. అలాగే 5వ వార్డు గోపాల దేవబోయినపల్లిలో గత మూడు సంవత్సరాలుగా లీకేజీలతో ఇబ్బందులు కలిగిస్తున్న మిషన్ భగీరథ పైప్‌లైన్లను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా అంబేద్కర్ నగర్ రెండో వార్డులో కౌన్సిలర్ బీరెల్లి మాధవరావు ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చైర్మన్ స్పష్టం చేశారు. కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్ బీరెల్లి మాధవరావును మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. బత్తుపల్లి గ్రామానికి చెందిన లక్కిరెడ్డి ఏసు రెడ్డి తన స్వగృహానికి ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగులోతు ఉమా రాణి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు జంగా పిచ్చి రెడ్డి, శీలం కృష్ణారెడ్డి, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, కత్తి కృష్ణారెడ్డి, పొదిలి వెంకటేశ్వరరావు, భాగం ప్రభాకర్ చౌదరి, కొర్రా నరసింహారావు, నోటి కృష్ణారెడ్డి, తోట జనార్థన్, శీలం నాగిరెడ్డి, దామాల సురేష్, గూడూరు వెంకట్ రెడ్డి, గుగులోతు ప్రసాద్, ధరావత్ రవికుమార్ పాల్గొన్నారు.

## రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



**ములుగు జిల్లా,మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఈరోజు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక రైతులు హాజరయ్యారు. సదస్సులో అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు దిగుబడులను మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, సహజ వనరులను ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ప్రత్యేకంగా రైతులు సాగు చేస్తున్న పంటలకు అనుగుణంగా ప్రకృతి ఎలా సహకరిస్తుందో వివరించారు. వర్షపాతం, నేల గుణాలు, స్థానిక వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే జీవామృతం, ఘన జీవామృతం, వేప నూనె వంటి సహజ పదార్థాలతో తయారయ్యే ఎరువులు, పురుగుమందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఇవి పంటల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు రైతులకు ఖర్చు తగ్గింపునకు దోహదపడతాయని వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటికి తగిన సూచనలు, పరిష్కార మార్గాలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేస్తే, భూమి ఆరోగ్యం కాపాడడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని అధికారులు సూచించారు.

# తెల్ల బట్టల పై ముత్యాల లాంటి మురికి నీరు పడాల్సిందేనా ?.






**- పేదోడి నుండి పెద్దోడి వరకు ఎవరిని వదలకుండా పడతాయి ముత్యాల లాంటి మురికి నీరు?.**

**-అమ్మాపురంలో మూసీ నది ఉన్నది మీకు తెలుసా?.**




**తొర్రూరు ప్రతినిధి, మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మూసీ నది అనగానే మీకు గుర్తుకొచ్చేది హైదరాబాదు మాత్రమే. పల్లె ప్రాంతాలలో కూడా మూసి నది ఉంటాయని ఎప్పుడైనా మీరు గమనించారా?. ఇదొక ప్రధాన రహదారి, ఈ గ్రామం అందరికీ సుపరిచితమే కానీ ఇక్కడ పట్టించుకునే నాధుడు కరువయ్యారు. ఇది ఈనాటి సమస్య కాదు గత కొన్నేళ్లుగా నడుస్తున్న చరిత్ర ఇది. గతంలో 60 ,70 సంవత్సరాల క్రితం ఈ గ్రామంలో పూరి గుడిసెలతో గ్రామస్తులు నివసించేవారు ప్రధాన రహదారి ఇరుకైన రోడ్డు ఒక వాహనం వెళితే కనీసం సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది ఆనాడు. కాలక్రమేన అభివృద్ధి చెందుతూ గ్రామంలో వెడల్పు రోడ్లను ఏర్పాటు చేశారు గత ప్రభుత్వంలో. గ్రామస్తులకు అధికారులకు మధ్య సమన్వయ లోపం ఏర్పడి వచ్చే మురికి నీటిని కాల్వ ద్వారా పంపించాల్సిన అధికారులు, గ్రామస్తుల మధ్య కాలువలు నిర్మించేందుకు ఎవరు ఒప్పుకోలేదని దానితో మురికి కాలువల నిర్మాణం చేపట్టకుండా వదిలేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇదంతా ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన గ్రామం ఇది. ఈ నెల 27వ తేదీ అమ్మాపురంలో గల మహా పుణ్యక్షేత్రం సీతారాముల కళ్యాణం జరగనుంది ఈ కళ్యాణానికి ప్రముఖులందరూ హాజరుకానున్నారు. వారి పైన కూడా ముత్యాల లాంటి మురికి నీరు పడాల్సిందే అంటున్నారు గ్రామస్తులు. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యేల ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో సందర్శించిన ఎమ్మెల్యే అభ్యర్థి యశస్విని రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే గ్రామంలో మురికి నీరు రహదారి గుండ ప్రవహించకుండా కాలువ నిర్మింప చేస్తామని హామీ ఇచ్చారు పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. అంతవరకు బాగానే ఉన్నా సర్పంచ్ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించి బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని సర్పంచ్ గా ఎన్నుకున్నారు గ్రామస్తులు. ఇప్పుడున్న సర్పంచ్ హయాంలో ఈ కాలువల నిర్మాణం చేపడతారా లేక అలాగే వదిలేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారిందని కొందరు గ్రామస్తులు పరిస్థితులను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారులను చూస్తే హైదరాబాదులోని మూసినది గుర్తుకొస్తుంది అని వాహనదారులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మాజీ ఎంపీటీసీ విక్రం రెడ్డి ,ప్రధాన పూజారి సూర్యనారాయణ అలాగే ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే భక్తులకు కూడా ఈ మూసినది దాటే పరిస్థితి ఏర్పడుతుందని ఇదే ప్రాంతంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు బస్సు కోసం వేచి ఉండే సమయంలో అతివేగంగా వస్తున్న వాహనాల వలన మురికి నీరు అంతా దుస్తులపై పడి దుర్గంగా భరితంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ఈ మూసి నీరునుతాత్కాలికంగా మామూలు కాలువలుగా ఏర్పాటు చేసి పంపించే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మరోవైపు అన్నారం వెళ్లే రహదారి వైపు ప్రభుత్వ పాఠశాల ఉండటంతో రోడ్డుకు అడ్డంగా నీరు ప్రవహిస్తూ ఉందని అదే సమయంలో వెళ్తున్న పాదచారులపై నీరు పడిపోవడం తో వారి దుస్తులు కూడా దుర్గంధ భరితంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ సర్పంచ్ లేదా అధికారులు స్పందించి గ్రామం నుంచి వెళ్తున్న మురికి నీరు పాదచారుల మీద పడకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వేడుకుంటున్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు... 20వ వార్డుకు నూతన రూపు

**కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు నేతృత్వంలో సమస్యలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు**





**కల్లూరు, మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ప్రస్తుతం పారిశుద్ధ్య పరంగా కొత్త రూపును సంతరించుకుంటోంది. ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకుని వెంటనే పరిష్కార దిశగా అడుగులు వేస్తున్న వార్డు కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు నాయకత్వంలో చేపడుతున్న పనులు ప్రజల్లో విశేష స్పందనను రాబడుతున్నాయి. వార్డులోని గోపాలకుంట చెరువు పరిసర ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు గత కొంతకాలంగా ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రధాన రహదారి, పుల్లయ్య బంజర్ రోడ్డుకు ఆనుకుని ఉన్న హోటళ్లు, ఆసుపత్రులు, ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు మొత్తం డ్రైనేజీ ద్వారా చెరువులోకి చేరుతోంది. అయితే డ్రైనేజీ మార్గం పూర్తిగా మట్టి, బురదతో పూడుకుపోవడంతో మురుగునీటి ప్రవాహం ఆగిపోవడం వల్ల దుర్వాసనలు వ్యాపించి, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ పరిస్థితిని సవాల్‌గా స్వీకరించిన కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు, సమస్యను కేవలం గమనించడమే కాకుండా వెంటనే చర్యలకు దిగారు. మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ సహకారాన్ని సమీకరించి, జెసిబి యంత్రాల సహాయంతో డ్రైనేజీ పూడిక తొలగింపు పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే పూడిక తొలగించి డ్రైనేజీ మార్గాన్ని పూర్తిగా శుభ్రపరచడంతో మురుగునీటి ప్రవాహం మళ్లీ సక్రమంగా సాగుతోంది. అదేవిధంగా గోపాలకుంట చెరువు పరిసరాలను శుభ్రపరచడంతో పాటు, కల్లూరు గౌడ స్మశాన వాటికలోని కంచె చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం ద్వారా పరిసరాలను శుభ్రంగా మార్చారు. ఈ చర్యల వల్ల అక్కడి వాతావరణం గణనీయంగా మెరుగుపడి, ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే భావనతో కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు తీసుకుంటున్న చర్యలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. సమస్యలు ఎదురైన వెంటనే స్పందిస్తూ, ఫీల్డ్ స్థాయిలోనే పరిష్కారాలు అమలు చేయడం ఆయన పనితీరుకు నిదర్శనం అని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ప్రతి చిన్న సమస్యను కూడా పట్టించుకుని పరిష్కరించేందుకు కట్టుబడి ఉండటం వల్ల వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండ్ల రవీంద్ర, ముత్యాల శీను, బొడ్డు తిరుపతిరావు, బొల్లం ఉపేంద్ర గౌడ్ తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు. స్థానిక ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించడం గమనార్హం. ప్రజల సమస్యలే నా బాధ్యత. ప్రతి ఇంటికి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం నా లక్ష్యం అని కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు తెలిపారు. ముందుముందు కూడా వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద 20వ వార్డులో జరుగుతున్న ఈ పారిశుద్ధ్య పనులు ఇతర వార్డులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలి

● ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశాలు




**కర్నూలు మార్చి 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో కొనసాగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత,వడదెబ్బలు, అగ్నిప్రమాదాలు పెరిగే అవకాశమున్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, దేవాలయాలు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో త్రాగునీరు, చలివేంద్రాలు, నీడ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు తగిన విశ్రాంతి, త్రాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని, మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు ఎండలో పని చేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా యంత్రాలు,సిబ్బంది అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే బావులు,చెరువులు, మైనింగ్ కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని తెలిపారు. వడదెబ్బలకు గురైన వారికి తక్షణ చికిత్స అందించేందుకు వైద్య శాఖ సిద్ధంగా ఉండాలని, ముఖ్య ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు తెల్లని దుస్తులు ధరించి, ఎక్కువగా నీరు, మజ్జిగ సేవిస్తూ ఎండ నుండి జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి










- మంత్రుల హామీలను అమలు చేయాలి

- ఖమ్మం నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, తెలంగాణ జాగృతి నాయకులు

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఖమ్మం నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం నుండి జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలను అప్పగించాలని కోరుతూ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబు చేస్తున్న రిలే నిరాహారదీక్షకు మంగళవారం ఖమ్మం నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత రెండున్నర దశాబ్దాలుగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ మోసం చేస్తూ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు జీతాలు లేక కిరాయి ఇండ్లలో జీవనం కొనసాగిస్తూ పిల్లల ఫీజులు కట్టలేక ఇంటి కిరాయి కట్టలేని పరిస్థితుల్లో అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఇరిగేషన్లన్నీ రెవెన్యూ ల్యాండ్ గా మార్చి ప్రత్యేక జీవో, క్యాబినెట్ ఆమోదంతో 23.02 ఎకరాల భూమిని ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించారని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ కార్యక్రమం ఆగిపోయిందని వాపోయారు. ప్రభుత్వం ఏర్పడక ముందే హామీ ఇచ్చిన ప్రస్తుత మంత్రులు హామీలు ఇస్తున్నారే గానీ ఇండ్ల స్థలాలను అప్పగించడం లేదన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇస్తానన్న ఇండ్ల స్థలాలను అప్పగించాలని, లేనియెడల ఈ నిరాహారదీక్షలలో మేము సైతం పాల్గొని ఉద్యమాన్ని ఉధృతంచేసి ఇండ్ల స్థలాలను సాధించుకుంటామని అన్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు మా సమస్యను అర్థం చేసుకొని ఇళ్ల స్థలాలను అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యలమందల జగదీష్ (రాజ్ న్యూస్), గుండ్ల రాంబాబు (10టివి), కిరణ్ (టి న్యూస్), కొమిరె నాగేశ్వరరావు(ఐ న్యూస్), సాయి (6టివి), సాయి (ఎన్ టివి), శ్రీను (సాక్షి టివి), సైదులు(బిగ్ టివి), ఉమేష్ (బి.ఆర్.కె టివి), కళ్యాణ్ (99 టివి), ఈశ్వరి (దక్ష టివి) వీరితో పాటు ప్రభాకర్ రెడ్డి, పులి శ్రీనివాస్, నూకల రామచంద్రమూర్తి, రోసిరెడ్డి, వెంకట్, సిహెచ్ రాంబాబు, శంకర్, సాంబశివరావు, పెంటి వెంకటేశ్వర్లు, నవజీవనప్రియ, రోజా, నాగరాజు, మంద వెంకటేశ్వర్లు, ఆర్ నాగశేఖర్, భద్రయ్య, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి బానోతు కిషన్ నాయక్, జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ, జిల్లా కార్యదర్శి వనం నాగేందర్, బంజారా జాగృతి జిల్లా అధ్యక్షులు జి రాజ్ కుమార్ నాయక్, యువజన సంఘం నాయకులు ఎస్.కె అరీఫ్ పాల్గొన్నారు.

# చోరీల ముసురులో మాధవరం - భయంతో వణికుతున్న గ్రామం

● అర్ధరాత్రి దుకాణంలోకి చొరబడ్డ దుండగులు.

● రూ.1.45 లక్షల నగదు గల్లంతు.

● పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు.



**సిద్ధవటం మార్చి 17 (పీసిడబ్ల్యూ న్యూస్):-** మండలంలోని మాధవరం గ్రామంలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో చోరీలు పెరుగుతుండటంతో గ్రామస్థులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. కొత్త మాధవరం 1, 2, 3 వార్డుల పరిధిలో నివాసముంటున్న సుధాకర్ అనే వ్యాపారి దుకాణంలో సోమవారం అర్ధరాత్రి దుండగులు చొరబడి భారీ మొత్తంలో నగదును అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లగా,మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దుకాణంలో ఉన్న వ్యాపార నగదు రూ.25,000 భార్య సురేఖ పొదుపు రూ.40,000 బీరువాలోని మరో రూ.80,000..మొత్తంగా రూ.1.45 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు తోచుకెళ్లారన్నారు. అయితే ప్రాంతంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ చోరీలు ఆగకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట భద్రత పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై సిద్ధవటం ఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ..బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను అప్రమత్తం చేశారు.

# బిజెపి పార్టీ ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి తోడ్పడాలి

**నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి**





**చిట్యాల మార్చి 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో చిట్యాల మండలంలోని బివిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో చిట్యాల.టేకుమట్ల.మొగుళ్లపల్లి మండలాల సంయుక్త ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్2026 శిక్షణ తరగతులు ఘనంగా నిర్వహించబడినవి.ఈ శిక్షణ కార్యక్రమం పార్టీ శక్తివంతమైన సంస్థాగత నిర్మాణానికి, సైద్ధాంతిక బలోపేతానికి కీలక వేదికగా నిలిచింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి. కార్యకర్తలకు సమగ్ర మార్గదర్శనం చేస్తూ, పార్టీ సిద్ధాంతాలు, కార్యాచరణ, ప్రజా సేవా దృక్పథంపై విస్తృతంగా అవగాహన కల్పించారుఅలాగే 1953లో ప్రారంభమైన క్రమశిక్షణాయుత శిక్షణా సంప్రదాయం నేటికీ బీజేపీకి అతిపెద్ద సంస్థాగత బలం అని, అదే పార్టీ విజయాలకు మూలకారణమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏడు నూతన నిషేధర్ రెడ్డి , బిజెపి రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి గౌడ్ రాష్ట్ర నాయకులు వెన్నం పెల్లి పాపయ్య చదువు రామచంద్ర రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవికిరణ్ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ వేణుగోపాల్ రెడ్డి గు నాగరాజుగౌడ్ సర్పంచులు ఉప సర్పంచులు గొర్రె శేషి కుమార్ తిరుపతి శ్రీధర్ కుమారస్వామి జరుపుల శ్రీను రాజేందర్ మండల నాయకులు మోరే రవీందర్ రెడ్డి తీగల జగ్గయ్య చెక్క నరసయ్య మండల మొగిలి దేశెట్టి గోపాల్ కూర మైపాల్ రెడ్డి మైదం శ్రీకాంత్ చింతల రాజేందర్ కేంసారపు ప్రభాకర్ రాయిని శ్రీనివాస్ గాజనల రవీందర్ గోపగాని స్వామి నీలి సుధాకర్ రెడ్డి శ్రావణ్ ప్రశాంత్ వెంకటేశ్వర్లు ఉడుత వ నక్క న గవత్ పూర్ణతదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఐ మల్లేష్



**చిట్యాల మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల సీఐ కార్యాలయంలో గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ మామ (కూచన జనార్ధన్ ) ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మరణించి ఐదవ రోజు కావడంతో, చిట్యాల సీఐ మల్లేష్ బాధిత కుటుంబాన్ని స్వయంగా కలిసి పరామర్శించారు. మరణించిన జనార్ధన్ చిత్రపటానికి సీఐ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలకృష్ణ మామగారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. "కుటుంబ పెద్దను కోల్పోవడం ఎంతో బాధాకరమని, ఈ కష్ట సమయంలో బాలకృష్ణ మామగారి కుటుంబానికి మేము అండగా ఉంటాం అని అన్నారు .ఈ పరామర్శ కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాతృత్వమే పరమావధిగా.. మానవసేవయే మాధవ సేవగా..ముందుకెళ్తున్నారు గోళ్ళ రాజేష్..

**గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో ప్రజలకు 1000 మందికి ఉగాది,రంజాన్ పండుగ సరుకులు కిట్ల పంపిణీ..**

**నంద్యాల పట్టణంలోని ప్రజలకు గోళ్ళ రాజేష్ తన ధాతృత్వం చాటుకుంటున్నారు. మానవసేవయే మాధవ సేవగా ముందుకెళు_న్నారు నంద్యాల వాసి ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్.**



**నంద్యాల, మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):**నంద్యాల నియోజకవర్గంలో గోళ్ళ రాజేష్ వ్యాపార నిమిత్తం స్థానికంగా అందుబాటులో లేనప్పటికీ కూడా నంద్యాల నియోజకవర్గ ప్రజలపై ఉన్న ప్రేమ , అభిమానాలతో గడిచిన నాలుగు నెలల పైగా కుల, మతాలకతీతంగా పేదల పెద్దన్నగా తనకు ఆర్థికంగా లక్షల రూపాయల ఖర్చు అవుతున్నప్పటికి ఎన్నో రకాలుగా తన వంతు సహాయ, సహకారాలు, ఆర్థిక సహకారాలు అందిస్తూ ముందుకెళుతున్నారు గోళ్ళ రాజేష్. అందులో భాగంగా ఈరోజు హిందూ సోదర, సోదరీమణులకు ఉగాది పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదర,సోదరీమణులకు రంజాన్ పండుగ ప్రతి ఒక్కరు సుఖ, సంతోషాలతో ఆనందాలతో కుటుంబ సభ్యులతో పండుగలు నిర్వహించుకోవాలని సదుద్దేశం తో ఈరోజు 1000 మంది కుటుంబాలకు పైగా ఉగాది పండుగ సరుకులు, రంజాన్ పండుగ సరుకుల కిట్ల పంపిణీ గోళ్ళ రాజేష్ కార్యనిర్వాహకులు సీనియర్ రిపోర్టర్ నూర్ భాషా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కార్య నిర్వాహకులు సీనియర్ రిపోర్టర్ నూర్ బాషా మాట్లాడుతూ పేదవారికి ఆత్మీయుడుగా ఇప్పటికే గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గంలో ఎన్నో రకాలుగా వివిధ రూపాలలో వేలాదిమందికి సహాయ, సహకారాలు ఆర్థిక సహకారాలతో పాటు పేదలందరికీ తోడబుట్టినవాడుగా గోళ్ళ రాజేష్ తన వంతు సహకారాలు అందిస్తూ ఉన్నారు. తనకు ఆర్థికంగా ఎంత భారం ఉన్నప్పటికీ కూడా వాటిని లెక్కచేయకుండా కేవలం పేదలకు సాయం చేయాలంటే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు గోళ్ళ రాజేష్ అని తెలిపారు. భవిష్యత్తులో గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గ ప్రజలకు ఇంకా ఎన్నో మెరుగైన సేవాసహాయ,సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని నియోజవర్గ ప్రజలందరూ కూడా గోళ్ళ రాజేష్ ను భగవంతుడు ఎల్లప్పుడూ చల్లగా చూసి ఆశీర్వదించాలని ఎందుకంటే ఇలాంటి సేవ తత్పరత ఉన్నటువంటి వారిని భగవంతుడు చల్లగా చూస్తే ఇలాంటి వారు భవిష్యత్తులో ప్రజలకు ఇంకా ఎన్నో సేవాసహాయ,సహకారాలు అందించేందుకు ముందుంటారని నంద్యాల నియోజకవర్గ ప్రజలందరూ కూడా గోళ్ళ రాజేష్ ని అతని మంచి మనసును ఆశీర్వదించి భగవంతున్ని ప్రార్థించాలని వారు తెలిపారు.

# నిర్మాణంలో ఉన్న మసీద్ - ఎ - షెహనాజ్ పనులను పరిశీలించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



**గోస్పాడు మార్చి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న "మసీద్ - ఎ - షెహనాజ్" ను నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మసీదు నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, పనుల పురోగతి గురించి కమిటీ సభ్యులను మరియు నిర్మాణ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ మా అమ్మగారి పేరు మీద మసీదును నిర్మించడం చాలా సంతోషంగా ఉందని , మసీదు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. మసీదు అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఫిరోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల టిడిపి నాయకులు హుస్సేన్ , మనోజ్ , మాజీ ఎంపీటీసీ హుస్సేనయ్య, వెంకటయ్య, రహీమ్, మాలి, చంద్ర, అక్బర్, సైలాబ్ మరియు మసీదు కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సత్తా చాటేందుకు సన్ రైజర్స్ సిద్ధం..



వేదిక ఏదైనా సరే... ఓపెనర్లు బరిలోకి దిగితే చాలు... బౌండరీల మోత... సిక్సర్ల వర్షం... అమాంతంగా స్కోరు బోర్డు పరుగులు పెడుతుంది. ఎవరికీ సాధ్యకాని రికార్డుల్ని తిరగరాసే సన్ రైజర్స్ హైదరాబాద్... తాజా సీజన్లో ప్రత్యర్థులకు చుక్కలు చూపించేందుకు జట్టును కూడగట్టుకుంది. తిరుగులేని విజయాలతో ప్రత్యర్థి జట్లపై సత్తా చాటబోతోంది.టీ20 వరల్డ్ కప్ పోటీల్లో భీకర బ్యాటింగ్ శైలితో ఆకట్టుకున్న ఇషాన్ కిషన్, వైబ్రేటింగ్ బ్యాటింగ్ కి మారుపేరుగా నిలిచిన అభిషేక్ శర్మ బ్యాటింగ్ శైలితో క్రికెట్ స్టేడియాలను షేక్ చేయాలని ఎదురుచూస్తున్నారు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి చివరిదాకా ఒకటే పంథాతో అత్యధిక పరుగులు రాబట్టాలనే ఆలోచనతో బ్యాట్స్ మెన్లు మానసిక సంసిద్ధతతో బరిలో దిగి సత్తా చాటాలని ఎదురుచూస్తున్నారు. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ ప్యాట్ కమిన్స్ సారథ్యంలో సన్ రైజర్స్ జట్టు సత్తా చాటేందుకు సిద్ధమైంది. డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ గా ఉన్న ఐపీఎల్ టీమ్ కాలక్రమంలో సన్ రైజర్స్ హైదరాబాద్ గా పేరు మార్చుకుంది. 18 సీజన్లలోనూ... అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించిన సన్ రైజర్స్... ప్రతిభావంతమైన జట్టుగా ఎదిగింది. డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో ప్రత్యర్థి జట్లపై మెరుగైన ప్రదర్శన చేసి.. ఐపీఎల్ 2016 సీజన్ ట్రోఫీని చేజిక్కించుకుంది. 2018, 2024 సీజన్లలో ఫైనల్ చేరుకుని పరాజయాన్ని చవిచూసింది. సన్ రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెన్ను గాయంతో ఉన్నాడు. దీంతో కమిన్స్ టి20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 ఆరంభమయ్యేలోపు అతడు పూర్తిగా కోలుకునే అవకాశాలున్నాయి. లేకుంటే కమిన్స్ స్థానంలో కొత్త సారథి సన్ రైజర్స్ హైదరాబాద్‌ను లీడ్ చేసే అవకాశం ఉంది. కెప్టెన్సీ రేసులో ముగ్గురు ప్లేయర్ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్‌లు కెప్టెన్సీ రేసులో ఉన్నారు. ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా ఐపీఎల్ 2026కు దూరమైతే.. ఈ ముగ్గురిలో ఒకరు కెప్టెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇషాన్ కిషన్‌కు సారథ్య బాధ్యతలు అప్పజెప్పే అవకాశం ఉందని తెలుస్తోంది. గతేడాది ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ ట్రోఫీ సాధించాడు. 2016లో జరిగిన అండర్ 19 ప్రపంచకప్‌లో టీమిండియా కెప్టెన్‌గా ఉన్నాడు. అప్పుడు భారత జట్టును విశ్వవిజేతగా నిలిపాడు.



# బుమ్రా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ టీ20 ప్లేయర్

**• సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్**

టీ20 క్రికెట్ చరిత్రలో ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాడు ఎవరనే చర్చకు సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ ఆసక్తికర సమాధానమిచ్చాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ టీ20 ప్లేయర్ అని తెలిపాడు. కొత్త బంతి అయినా.. పాత బంతి అయినా చివరకు సూపర్ ఓవర్ అయినా.. బుమ్రా చేతికి బంతి ఇస్తే మ్యాచ్‌ను గెలిపిస్తాడని వివరణ ఇచ్చాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వికెట్లు తీయగల సామర్థ్యం అతనికి ఉందని కొనియాడాడు. అయితే తనకు బౌలింగ్ చేయనంత వరకే బుమ్రా గ్రేటెస్ట్ బౌలర్ అని చమత్కరించాడు. తనతో పాటు విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్ వంటి దిగ్గజ బ్యాటర్ల పేర్లు చెప్పకుండా.. డివిలియర్స్ ఒక బౌలర్‌ను ఎంచుకోవడం విశేషం. 2013 మార్చిలో టీ20ల్లోకి అరంగేట్రం చేసిన బుమ్రా.. 270 మ్యాచ్‌లు ఆడి 345 వికెట్లు తీసాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరఫున 95 మ్యాచ్‌ల్లో 121 తీసాడు. టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున 145 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు తీసాడు. ముంబై తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. మరోవైపు పాకిస్థాన్ మాజీ పేసర్ ఆకిబ్ జావేద్..జస్‌ప్రీత్ బుమ్రాపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. బుమ్రా విలక్షణమైన బౌలింగ్ యాక్షన్‌తోనే బ్యాటర్లకు లయ దొరకదని చెప్పిన ఆకిబ్ జావేద్.. అతన్ని మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్‌తో పోల్చాడు. 'ఫాస్ట్ బౌలింగ్‌లో బుమ్రా ఒక ఉస్మాన్ తారిఖ్ లాంటివాడు'అని అభివర్ణించాడు. అయితే ఈ పోలికపై భారత క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. ప్రపంచ స్థాయి పేసర్‌ను ఒక సాధారణ స్పిన్నర్‌తో పోల్చడమేంటని నెటిజన్లు మండిపడుతున్నారు.

# హాట్ ఫేవరేట్‌గా బరిలో బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రాయల్ ఛాలెంజర్స్ టీమ్ ప్రత్యేకతను సంతరించుకుంది. క్రీజులో దిగడమే ఆలస్యం పరుగుల వరద పారించాలనే లక్ష్యంతో ఆడే బ్యాట్స్ మెన్లున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ సీజన్ లోనూ అత్యుత్తమంగా రాణించాలని ఆటగాళ్లు ఉవ్విళ్లూరు తున్నారు. ఆల్ రౌండర్లతో ఆటగాళ్ల కూర్పు... జట్టు జవసత్వాలు కూడగట్టుకుని ఈ సీజన్లో రెట్టింపు ఉత్సాహంతో సత్తాచాటేందుకు సిద్ధమైంది. గత సీజన్లోనే ఆర్సీబీ సారథ్యం బాధ్యతలు విరాట్ కోహ్లీ నుంచి రజత్ పాటిదర్ అందుకున్నారు. సీనియర్ ఆటగాళ్ల సమన్వయంతో జట్టును సమర్థవంతంగా నడిపించిన పాటిదర్, ట్రోఫీ సాధన కలను సాకారం చేశాడు. గత సీజన్లో ఛాంపియన్ గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో ఒక్కొక్కరిది ఒక్కో పాత్ర పోషించారు. అందరూ అద్భుతంగా ఆటడంతో 18ఏళ్లనాటి నిరీక్షణ ఫలించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇప్పటిదాకా 18 సీజన్లలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ చేసి నాలుగుసార్లు ఫైనల్ కు చేరుకుంది. మూడుసార్లు రన్నర్ గా నిలిచింది. 2025 సీజన్ లో ఛాంపియన్ గా నిలిచింది. ఆర్సీబీ ట్రోఫీని తొలిసారిగా ముద్దాడింది. అదే ఉత్సాహంతో ఈ సీజన్లోనూ అత్యుత్తమ ప్రదర్శనతో వరుసగా రెండోసారి ట్రోఫీకోసం డిపెడింగ్ ఛాంపియన్ గా సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఐపీఎల్ లో ఆర్సీబీ విలక్షణమైన జట్టుగా అవతరించింది. సరికొత్త సీజన్ లో అద్భుతమైన ఆటగాళ్లతో జట్టు సిద్ధమైంది. డిపెండింగ్ ఛాంపియన్ గా ప్రత్యర్థి జట్లతో తలపడి భారీ స్కోర్లు నమోదు చేయాలనే సంకల్పంతో ఉంది. కెప్టెన్ రజత్ పాటిదర్ తనదైన శైలితో ఆటతీరును ప్రదర్శించబోతున్నాడు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సీనియర్ ఆటగాళ్ల సూచనలు, సలహాలు తీసుకుని వ్యూహాత్మకంగా జట్టును ముందుకు నడిపించాలనే తపనతో ఉన్నారు. ఐపీఎల్ మ్యాచ్ లు ఇప్పటిదాకా జరిగిన మ్యాచులు వేరు... ఇపుడు కొత్త ఆటగాళ్లతో బరిలో దిగి ప్రత్యర్థి జట్టును ఆటకట్టించడమే ధ్యేయంగా ఆటగాళ్లు సన్నాహాలు చేస్తున్నారు. ఐపీఎల్ లో ఒక ఆటగాడు.. ఒకే ఫ్రాంచైజీలో సుధీర్ఘ కాలం కొనసాగడంలో రన్ మెషీన్ విరాట్ కోహ్లీకే సాధ్యమైంది. ఐపీఎల్ 18 సీజన్లలో అత్యుత్తమ బ్యాటింగ్ ప్రదర్శనతో ఆల్ టైమ్ రికార్డు విరాట్ కోహ్లీ పేరుతోనే కొనసాగుతోంది. 18 సీజన్లలో 267 మ్యాచులను ఆడిన విరాట్ కోహ్లీ 8661 పరుగుల రికార్డు సొంతం చేసుకున్నాడు. అలాగే అన్ని సీజన్లలో కలిపి విరాట్ కోహ్లీ 771 బౌండరీలను చేశారు. 291 సిక్సర్లు కొట్టారు. ఐపీఎల్ కెరీర్ లో విరాట్ కోహ్లీ 8 సెంచరీలు, 63 అర్ ధశతకాలను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రతి సీజన్లోనూ విరాట్ కోహ్లీ అత్యధిక స్కోరు సాధించడంలో వెనుకాడలేదు. ఈ సీజన్ లోనూ... బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇవ్వాలని విరాట్ కోహ్లీ నిర్ణయించుకున్నారు. మరోసారి ఆర్సీబీకి ట్రోఫీని అందివ్వాలనే ఉద్దేశంతో విరాట్ విశేష కృషి చేస్తున్నారు. చాలా సందర్భాల్లో విరాట్ కోహ్లీ సాధించిన పరుగులే.. ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించేలా చేసింది. అత్యధిక పరుగుల ఛేదనలో విరాట్ కోహ్లీ ఆటతీరు మారిపోతుంది. క్రీజులో నిలబడి... బంతులకు, సాధించాల్సిన స్కోరు అంతరం పెరిగినపుడు కోహ్లీ విశ్వరూపం చూపిస్తారు. ఈ సీజన్లోనూ అత్యధిక పరుగుల సాధనలో సత్తా చాటాలని కోహ్లీ ప్రయత్నిస్తున్నారు. ఆటలోకి అడుగుపెట్టినప్పటినుంచి స్కోరు బోర్డును పరుగులు పెట్టించే ఆటగాళ్లు ఆర్సీబీ సొంతమైంది.

# కేకేఆర్ ఫ్రాంచైజీతో నాది విడదీయని బంధం

**• టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్**



కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) ఫ్రాంచైజీతో తనది విడదీయని బంధమని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. కేకేఆర్‌తో తనకు అదృష్టమని, కెప్టెన్‌గా, కోచ్‌గా తనకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టిందన్నాడు. అసలు తాను టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ప్రధాన కారణం కేకేఆర్ అని గంభీర్ స్పష్టం చేశాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ విజేతగా నిలవడంలో హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ కీలక పాత్ర పోషించాడు. టీమ్ సెలెక్షన్ నుంచి మైదానంలో అమలు చేసే వ్యూహాల వరకు అన్నీ తానై నడిపించాడు. దాంతో ఆటగాడిగా.. కోచ్‌గా టీ20 ప్రపంచకప్ గెలిచిన ఘనతను అందుకున్నాడు. అంతేకాకుండా భారత జట్టుకు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించిన ఏకైక కోచ్‌గా గంభీర్ చరిత్రకెక్కాడు.తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంలో కేకేఆర్ ఫ్రాంచైజీది కీలక పాత్ర అని గంభీర్ తెలిపాడు.' 7-8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నేను కోల్‌కతా జట్టు మెంటార్‌గా బాధ్యతలు చేపట్టాను. ఆ సీజన్‌లో కేకేఆర్ మెరుగైన ప్రదర్శన చేసి విజేతగా నిలవడంతో అప్పటి బీసీసీఐ సెక్రటరీ జై షా టీమిండియా హెడ్ కోచ్ పదవిని ఆఫర్ చేశాడు. అయితే గతంలో నాకు హెడ్ కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. దాంతో మొదట్లో సంకోచించాను. మెంటార్‌గా ఉండటానికి, హెడ్ కోచ్‌గా ఉండటానికి చాలా తేడా ఉంటుంది. అయినప్పటికీ భారత క్రికెట్‌పై నాకు ఉన్న అనుబంధం కారణంగా ఈ సవాల్‌ను స్వీకరించేందుకు అంగీకరించాను. ఐపీఎల్ 2024 సీజన్‌లో నేను కేకేఆర్ మెంటార్‌గా బాధ్యతలు చేపట్టకపోయినా.. ఆ జట్టు టైటిల్ గెలవకపోయినా ఈ రోజు నేను టీమిండియా హెడ్ కోచ్‌గా ఉండేవాడిని కాదు. నా ఎదుగుదలకు కోల్‌కతానే ఒక ప్రధాన కారణం. కెప్టెన్‌గా.. ఇప్పుడు కోచ్‌గా కూడా కోల్‌కతా నాకు ఎప్పుడూ అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఆ జట్టుతో.. ఆ నగరంతో నాకు ఒక ప్రత్యేకమైన బంధం ఉంది.

# సంజూ శాంసన్ కేరళకు గర్వకారణం: సీఎం పినరయి విజయన్



**హైదరాబాద్:** టీ20 వరల్డ్ కప్ హీరో సంజూ శాంసన్ కేరళ సీఎం పినరయి విజయన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో సీఎం అధికార నివాసానికి సంజును ఆహ్వానించి పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు. మోగా టోర్నీలో కీలక సమయంలో అద్భుత ఆటతీరుతో టీమిండియాకు కప్ అందించడంలో ముందున్నందుకు సంతోషంగా ఉందని, కేరళకు గర్వకారణమని కొనియాడారు. తన ఆటతో కేరళ క్రికెట్ ఆటగాళ్లకు ఆదర్శనీయంగా నిలిచారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ తరహా ప్రదర్శనతో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు అందించాలని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.సంజు.. వెస్టిండీస్‌పై నాకౌట్ మ్యాచ్‌లో 89, సెమీ-ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 89, న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో మరో 89 పరుగులు చేశాడు. మార్చి 8న న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో ఓడించి ౨20 ప్రపంచ కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది టీమిండియా. ఈ విజయంతో భారత్ సొంతగడ్డపై ౨20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న మొదటి జట్టుగా, 2024లో విజయం సాధించిన తర్వాత వరుసగా టైటిల్స్‌ను గెలుచుకున్న మొదటి జట్టుగా మరియు మూడుసార్లు (2007, 2024, మరియు 2026) ట్రోఫీని అందుకున్న మొదటి జట్టుగా భారత్ నిలిచింది.సంజూ శాంసన్ టోర్నమెంట్‌లో ఐదు ఇన్నింగ్స్‌లలో 80.25 సగటుతో, 199.37 స్ట్రైక్ రేట్‌తో 27 ఫోర్లు, 24 సిక్స్‌లతో 321 పరుగులు చేశాడు. ప్రపంచ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికయ్యాడు.

# ప్రభాస్ ..ఫౌజీ దసరాకు పక్కా

## శరవేగంగా సాగుతున్న షూటింగ్



ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామి సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

------------

# చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా

## ఉస్తాద్ ప్రమోషన్‌లో హరీష్ శంకర్



ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు. ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు అని ప్రశంసించారు.

# బాలీవుడ్ అశ్లీలతపై కఠిన నియంత్రణ ఉండాల్సిందే



బాలీవుడ్ తన స్థాయిని దిగజార్చుకుంటూ, ప్రేక్షకులను ఆకర్షించడం కోసం అన్ని హద్దులను దాటేస్తోందని స్టార్ హీరోయిన్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శించారు. చౌకబారు ట్రిక్కులతో అశ్లీలతను ప్రోత్సహిస్తున్న సినీ పరిశ్రమ తీరును దేశమంతా ఛీకొడుతున్నా, వారికి ఏమాత్రం సిగ్గు ఉన్నట్లు అనిపించడం లేదని ఆమె మండిపడ్డారు. ఇలాంటి అభ్యంతరకర ప్రదర్శనలకు చెక్ పెట్టాలంటే ప్రభుత్వం బాలీవుడ్‌పై కచ్చితంగా కఠినమైన నియంత్రణ విధించాలని, అప్పుడే ఈ అశ్లీలతకు ఎండ్ కార్డ్ పడుతుందని కంగనా గట్టిగా నొక్కి చెప్పారు.

అసలు ఈ వివాదం 'కేడీ.. ది డెవిల్' అనే కన్నడ చిత్రం కోసం రూపొందించిన హిందీ పాటతో మొదలైంది. ఈ పాటలోని సాహిత్యం పచ్చిగా, డబుల్ మీనింగ్ డైలాగులతో ఉందంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. కేవలం సాధారణ ప్రజలే కాకుండా, ప్రముఖ గాయకుడు అర్మాన్ మాలిక్ కూడా కమర్షియల్ సాంగ్ రైటింగ్ ఇంతగా దిగజారిపోవడం బాధాకరమంటూ తన అసహనాన్ని వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో నోరా ఫతేహి నటించిన ఈ పాటను ఇప్పటికే యూట్యూబ్ నుంచి తొలగించారు. అంతేకాకుండా, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని చిత్ర బృందానికి నోటీసులు జారీ చేయడం గమనార్హం.

# విడుదలకు ముందే ఓవర్సీస్‌లో ఉస్తాద్ వసూళ్ల మోత



పవర్ స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు కేవలం రెండు రోజులే మిగిలి ఉంది. సినిమాపై ఇప్పటికే అంచనాలు ఆకాశాన్ని అంటుతుండగా, విడుదలకు ముందు వస్తున్న అప్‌డేట్లు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోలకు ఇంకా సమయం ఉండగానే, అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా ఏకంగా 250ఖ డాలర్ల (సుమారు రూ. 2.31 కోట్లు) మార్క్‌ను దాటేసింది. ఈ ట్రెండ్ చూస్తుంటే ప్రీమియర్లతోనే భారీ వసూళ్లు ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

మరోవైపు దర్శకుడు హరీశ్ శంకర్ సినిమా ఫైనల్ అవుట్‌పుట్‌పై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ... "సినిమా ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా సంతోషంగా ఉంది. అభిమానులకు కావాల్సిన మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ కచ్చితంగా లభిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఆయన మాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. సినిమాలో పవన్ మాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుండగా, కీలక పాత్రల్లో పార్థిబన్, గౌతమి, రావు రమేశ్ వంటి ప్రముఖ నటులు నటిస్తున్నారు. సినిమాకు సంగీతం మరో ప్రధాన బలంగా నిలుస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలు ఇప్పటికే చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. దీనికి తోడు నేపథ్య సంగీతాన్ని స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ అందించడం విశేషం. ఆయన అందించిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్ సన్నివేశాలను మరో స్థాయికి తీసుకెళ్తుందని చిత్రబృందం నమ్మకంగా చెబుతోంది. అలాగే, సాధారణ ప్రేక్షకులకు కూడా అందుబాటులో ఉండేలా టికెట్ ధరలను నిర్ణయించడం సినిమాకు కలిసొచ్చే అంశంగా మారింది. ఈ నిర్ణయం వల్ల ఓపెనింగ్స్ మరింత భారీగా ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పెరుగుతున్న క్రేజ్, అడ్వాన్స్ బుకింగ్స్ జోరు చూస్తుంటే 'ఉస్తాద్ భగత్ సింగ్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తోంది.

# వ్యక్తిగత జీవితాలపై కెమెరాల కన్ను

## ముంబై నుంచి చెన్నైకి పాకిన జాడ్యం

## విజయ్, త్రిషల వ్యవహారంపై ఖుష్బూ



విజయ్, త్రిషల గురించి కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలపై నటి ఖుష్బూ మరోమారు స్పందించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో త్రిష గురించి మాట్లాడుతూ.. ఆమె చాలా హుందాగా ఉంటుందన్నారు. తెలియని వారు చేసే కామెంట్స్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. 'ప్రస్తుతం మనం ఎలాంటి రోజుల్లో ఉన్నామంటే.. ఎవరైనా తుమ్మినా వాళ్లను నిందించేస్తున్నాం. ఇది చాలా దురదృష్టకరం. నాకు విజయ్, త్రిష ఇద్దరూ బాగా తెలుసు. ముఖ్యంగా త్రిష నాకు చాలా సన్నిహితురాలు. నాకు తెలిసిన గొప్ప మహిళల్లో తను ఒకరు. ఎంతో మృదుస్వభావి అని చెప్పారు. ఇక రూమర్స్ సృష్టించేవారు, ఫొటో గ్రాఫర్లను ఉద్దేశించి ఖుష్బూ మాట్లాడుతూ.. ఈ ఫొటోగ్రాఫర్లు ప్రతిచోటా సెలబ్రిటీల వెనకపడటం అనేది ముంబయిలో చూస్తుంటాం. ఇప్పుడు ఆ సంస్కృతి చెన్నైలో కూడా మొదలవడం బాధాకరం. ఎదుటివారి వ్యక్తిగత జీవితాల గురించి కామెంట్స్ చేసేవారు.. తమ సమస్యల కంటే ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికే ఇష్టపడతారు. ఒకరి గురించి తప్పుగా మాట్లాడుతూ వారు ఒక రకమైన పైశాచిక ఆనందాన్ని పొందుతుంటారు. ఇలాంటి కామెంట్స్ చేసేవారిలో 99.9 శాతం మంది ఎవరో కూడా మనకు తెలియదు. అలాంటివారు చేసే వ్యాఖ్యలకు స్పందిస్తూ మన విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని నేను భావిస్తున్నాను అని ఖుష్బూ అన్నారు. ఇటీవల కూడా ఖుష్బూ వీరిద్దరి గురించి మాట్లాడారు. 'ఈ వ్యవహారంతో ప్రజలకు ఏం సంబంధం ఉందో నాకు అర్థంకావట్లేదు. అది వారి వ్యక్తిగతం. దీనిని ఎందుకు పెద్ద విషయంలా చూస్తున్నారు?' అని పేర్కొన్నారు.



# పవన్ కోసం కథ కూడా వినలేదు.. పదేళ్ల నా కల నెరవేరింది: రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలిసి నటించాలన్న తన చిరకాల స్వప్నం 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో నెరవేరిందని ప్రముఖ నటి రాశీ ఖన్నా అన్నారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ దశాబ్ద కాలంగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆమె, ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పలు ఆసక్తికర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. "నా తొలి చిత్రం చేస్తున్నప్పటి నుంచే పవన్ కల్యాణ్ గారి స్టార్‌డమ్, పవనిజం గురించి ఎంతో విన్నాను. ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని అప్పటినుంచే అనుకున్నాను. అందుకే హరీశ్ శంకర్ గారు ఈ అవకాశం ఇవ్వగానే, కథ కూడా వినకుండానే వెంటనే ఓకే చెప్పేశాను" అని రాశీ ఖన్నా తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌తో పనిచేయాలనే కోరికతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తాను ఎంతో కష్టపడ్డానని రాశీ తెలిపారు. పవన్ కల్యాణ్ గారి బిజీ షెడ్యూల్స్ కారణంగా తన డేట్స్‌ను సర్దుబాటు చేసుకున్నానని, కొన్నిసార్లు పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటల పాటు కూడా పనిచేశానని గుర్తుచేసుకున్నారు. ఈ చిత్రంలో తాను 'శ్లోక' అనే ఆధునిక యువతి పాత్రలో కనిపిస్తానని, తనపై చిత్రీకరించిన ఒక మాస్ పాట అభిమానులను ఉర్రూతలూగిస్తుందని ఆమె వివరించారు. 'గబ్బర్ సింగ్' తరహాలోనే 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా, అదే సమయంలో మంచి కుటుంబ కథాంశంతో అలరిస్తుందని రాశీ ధీమా వ్యక్తం చేశారు. ఈ సినిమాతో ప్రేక్షకులు మళ్లీ 'వింటేజ్ పవన్ కల్యాణ్'ను తెరపై చూస్తారని ఆమె అన్నారు. శ్రీలీల మరో కథానాయికగా నటించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. 2014లో 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన రాశీ ఖన్నా, తొలి చిత్రంతోనే విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత 'బెంగాల్ టైగర్', 'సుప్రీమ్', 'జై లవ కుశ', 'తొలిప్రేమ' వంటి విజయవంతమైన చిత్రాలతో అగ్ర కథానాయికగా ఎదిగారు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, హిందీ చిత్ర పరిశ్రమల్లోనూ నటిస్తూ తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.